

ప్రతి బుధవారం రెవెన్యూ సదస్సు: జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించుటకు ఈనెల 31న నుంచి ప్రతి బుధవారం నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇకపై ప్రతి బుధవారం ఏదో ఒక నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని, నియోజకవర్గం పరిధిలోని నిర్వహించే రెవెన్యూ సదస్సులో రెవెన్యూ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆయా నియోజకవర్గం పరిధిలోని ప్రజలు రెవెన్యూకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవడానికి మంచి అవకాశం ఉందని దీన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. తహశీల్దార్లు, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికిపెట్టే 'చాట్‌బాట్'

- హాయ్, హలో.. మెసేజ్‌తో మొబైల్ ట్రాకింగ్ మొదలు
- వందల సంఖ్యలో ఫోన్లు రికవరీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

నేడు సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువులా మారిపోయింది. అరచేతిలోనే ప్రపంచాన్ని చూడొచ్చు. అరచేతిలోనే షాపింగ్, చదువులు, సమాచారాలు, నగదు ట్రాన్స్‌ఫర్ నుంచి ఒక్కటేమిటీ అన్ని రకాల పనులు, వస్తువుల కొనుగోళ్లు ఫోన్‌ద్వారా జరిగిపోతున్నాయి. ఎటువంటి సమాచారాన్ని అయినా సునాయాసం ఫోన్‌లో ఇంటర్‌నెట్ ద్వారా తెలుసుకోవచ్చు. అలాంటి సెల్‌ఫోన్ కాసేపు కనిపించకుండా పోతే ఇక దిక్కుతోచని పరిస్థితి. ప్రస్తుతం అత్యంత ఖరీదైన టచ్‌ఫోన్ అందుబాటోకి వచ్చేశాయి. సాధారణ టచ్‌ఫోన్ నుంచి అత్యంత ఖరీదైన సెల్‌ఫోన్లను కూడా వాడుతున్నారు.

సెల్‌ఫోన్ పొరబాటున పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా వెంటనే కనిపెట్టడానికి చిత్తూరు జిల్లా పోలీసులు ఏర్పాట్లు చేసింది. సెల్‌ఫోన్ పోయిన వెంటనే జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ రికవరీ యాప్ 99440 900004కు చాట్‌బాట్‌తో హాయ్..! హలో...! అని టైప్ చేయగానే సెల్‌ఫోన్ ఈఎంఐ నెంబర్ ఫోన్ మోడల్ ఇతర, వివరాలను సేకరించి పోగొట్టుకున్న లేక చోరీకి గురైన సెల్‌ఫోన్ తిరిగి పొందవచ్చు.

ఇలా పొగొట్టుకున్న సెల్‌ఫోన్సు చిత్తూరు జిల్లా మొబైల్స్ ట్రేస్ చేసిన చిత్తూరు పోలీస్ దాదాపు కోటి రూపాయల విలువ చేసే 500 టచ్ మొబైల్ ఫోన్సును జమ్మూ అండ్ కాశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ, బీహార్ వంటి రాష్ట్రాల నుండీ రికవరీ చేశారు. సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించి బాధితులకు అందజేశారు. ఓ బాధితురాలికి తన ఫోను పోయిందని ఫిర్యాదు చేసిన నాలుగు గంటల వ్యవధిలోనే రివకరీ చేశారు.



పోలీసులు రికవరీ చేసిన 500 సెల్‌ఫోన్లు (ఫైల్‌ఫొటో)

ఫోన్ పోయిన వెంటనే చేయాల్సిన పని..

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు ముందుగా 94409 00004 నంబర్ వాట్సాప్‌కు హాయ్.. లేదా హలో అని మెసేజ్ పంపాలి. తర్వాత వెనువెంటనే వెల్‌కమ్ టూ చిత్తూరు పేరున ఒక లింక్ హాయ్.. హెల్ఫ్ అని మీ మొబైల్‌కు మెసేజ్ వస్తుంది. ఆ లింకులో గూగుల్ ఫార్మట్ ఓపెన్ అవుతుంది. ఆ వివరాలను పూరించాలి. జిల్లా, పేరు, వయస్సు, తండ్రి, చిరునామా, కాంటాక్టింగ్ నంబర్, మిస్సైన మొబైల్ మోడల్, ఈఎంఐ నంబర్, మిస్సైన ప్లేస్ వివరాలను సబ్మిట్ చేసిన వెంటనే కంప్లైంట్ క్లిస్ చేసే లాగిన్ అవుతుంది.

చాట్‌బాట్ సేవలను వినియోగించుకోవాలి

ఫోన్ చోరీకి గురైనా, మిస్సైనా చాట్‌బాట్‌లో ఫిర్యాదు నమోదు చేయడం జరుగుతుంది. మన సెల్‌ఫక్షన్ ఈఎంఐ నెంబర్ ఆధారంగా మొబైల్ ట్రాకింగ్ ద్వారా పోలీసులు మన సెల్‌ఫోన్ ఎవరు వాడుతున్నారు. ఏ ప్రాంతంలో ఉంది అని గుర్తించి రికవరీ చేస్తారు.

ఎఫ్ఐఆర్‌కు స్టేషన్ వెళ్లాల్సిన అవసరం లేదు..

- రిషాంత్ రెడ్డి, జిల్లా ఎస్పీ



పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను ఎటువంటి కంప్లైంట్ లేకుండా పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఇంట్లో కూర్చొనే చిత్తూరు పోలీసుల యాప్ అయిన చాట్‌బాట్ ద్వారా మరలా పొందవచ్చు. మొబైల్ పోగొట్టుకున్న బాధితులు కేవలం చిత్తూరు జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి కూడా ఫిర్యాదు చేస్తున్నారు. వారి ఫోన్‌లను కూడా రికవరీ చేసి అందజేస్తున్నాం. అలాగే ఇంకా పెండింగ్ రికవరీలు ఉన్నాయని, వాటిని కూడా అతిత్వరలో రికవరీ చేసి బాధితులకు అందజేస్తాం. మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు వేగవంతంగా రికవరీలు చేసి అందిస్తాం..

ఉపాధి (క్రి)పనులే ఆధారం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు క్షేత్రస్థాయిలో వసతులు కరువయ్యాయి. రోజురోజుకూ ఎండలు మండుతున్న నేపథ్యంలో కూలీలు సేదతీరడానికి టెంట్లు, తాగునీటి అందించక పోవడంతో ఎండలోనే సేదతీరాల్సిన దుస్థితి నెలకొంది. పనులు జరుగుతున్న చోటు దగ్గర టెంట్లు, తాగునీటి వసతులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్యం వంటి సౌకర్యాల జాడే కానరాలేదు. అయితే ఇక్కడ ఇలా ఉన్నా చాలా మందికి ఉపాధి పనులే ఉపాధిని కల్పిస్తున్నాయి. వీటి ద్వారానే వృద్ధులు సైతం జీవనం సాగిస్తున్నారు.

మండల పరిధిలోని పెద్దచెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా ప్రజాశక్తి వారిని పలకరించింది. వారు పనిప్రదేశంలో పడుతున్న ఇబ్బందులకు ప్రజాశక్తితో పంచుకున్నారు. కెటిల్ ఫండ్ వర్క్ చేస్తున్న కూలీలకు సంబంధించి మస్టర్ లేకపోవడంతో ఓ నోట్‌బుక్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారని అధికారులను కూలీలు అడుగుంటే రేపు నమోదు చేస్తాం, మర్నాడు చేస్తామంటూ దాటవేస్తామంటూ కబుర్లు చెబుతున్నారు. అలాగే గంగినాయన పల్లి గ్రామానికి చెందిన 42 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. గతంలో చేసిన బిల్లులు ఇంకా అందకపోవడంతో వారు కూలి డబ్బులు వస్తాయో రావో అని ఆందోళన చెందుతున్నారు.

పని చేయకపోతే పూట గడవదు..

- లక్ష్మమ్మ, ఉపాధి కూలీ



నా పేరు లక్ష్మమ్మ (67) నా భర్తను పోషించడానికి ఉపాధి పనులకు వస్తున్నాను. ఈ వయస్సులో పని చేయకుంటే పూట గడవదు. ఎంత కష్టమైనా పని చేయాల్సింది. అయితే ఇంత కష్టపడినా సకాలంలో కూలి డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో లాగే ఎండాకాలంలో ఇచ్చే అదనపు కూలి డబ్బులు పెంచి ఇస్తే మా జీవనానికి ఉపయోగంగా ఉంటుంది.

వారం వారం బిల్లులు చెల్లించండి

- కమలమ్మ, ఉపాధి కూలీ



నాపేరు కమలమ్మ (76). నాకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. వ్యవసాయ పంట పొలంలో బోరు వేసినా నీరు పడకపోవడంతో పంటను నష్టపోయాం. దీంతో నా కొడుకులిద్దరూ కర్ణాటక రాష్ట్రానికి వలస కూలీలుగా వెళ్లారు. అయితే ఇక్కడ నేను బతకడానికి ఉపాధి పనులు చేసుకుంటూ చాలీచాలని డబ్బుతో బతుకుతున్నాను. వారం వారం కూలీ డబ్బులు ఇస్తే కొంత ఉపయోగంగా ఉంటుంది. ఎక్కువ కాలం కూలీ డబ్బులు ఇవ్వకపోవడంతో తిండి గింజలకు భారమోపోతుంది.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రిలే దీక్ష



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు శివయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తూరు తాలూకా అధ్యక్షులు ఫిలిప్స్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా అధ్యక్షులు వి.శివయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర నాయకత్వం పలుమార్లు ప్రభుత్వంతో చర్చించినా ఫలితం లేకపోయిందన్నారు. ఉద్యోగుల సమస్యల సాధనకై గత నెలలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా సమస్యల సాధనకై కార్యాచరణ రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గొంతి ఆస్కారావు లు రూపకల్పన చేశారన్నారు. ఈమేరకు చిత్తూరు జిల్లాలో మొదటగా కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించడం జరిగిందని అన్నారు. జిల్లా కార్యదర్శి హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి దేవకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు అందాల్సిన పిఆర్సి బకాయిలు ఇంతవరకు ప్రభుత్వం చెల్లించలేదని, ఆ విషయమై ఆలోచించడం కూడా లేదని విమర్శించారు. జిల్లాఉపాధ్యక్షులు డి.నరేష్ బాబు, గోపి, రవికిరణ్, గౌరీ శంకర్, జిల్లా జాయింట్ సెక్రెటరీ మనోజ్ కుమార్, రవికుమార్, హరిప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చలపతి రెడ్డి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారి


మరమ్మతులు వారంలో చేయిస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- యాదమరి

చిత్తూరు - పరదరామి అంతర్రాష్ట్ర రహదారి రోడ్డు మరమ్మతులను వారంలో చేపడతామని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని ప్రధాన సమస్యలపై సభ్యులు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. అంతరాష్ట్ర రహదారి జోడిచింతల నుండి తమిళనాడు సరిహద్దు వరకు అస్తవ్యస్తంగా తయారైందని వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వారంలోపు రోడ్డు మరమ్మతు పనులు చేపడతామని హామీఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదల అనుభవంలో భూములకు అసైన్మెంట్ కమిటీ ద్వారా పట్టాలిచ్చే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. అర్హులైన రైతులు వ్యవసాయ కూలీల భూములను గుర్తించి వారి పేర్లు అసైన్మెంట్ కమిటీలో నమోదు చేసిన వివరాలు తమకు అందించాలని తెలిపారు. మండలంలో వేరుశనగ విత్తనాలు ప్రతిఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి చరితను ఆదేశించారు. ఉపాధి హామీ ఏపీఓ బాల మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు మామిడి చెట్ల పెంపకం, ఫారం ఫండ్, సరిహద్దు కందకాలు మొదలైన పనులు అందుబాటులో ఉన్నాయని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జడ్పీ వైస్‌చైర్మన్ ధనుంజయ రెడ్డి ఆదేశించారు. మండల సర్వసభ్య సమావేశంకు సగం మంది సర్పంచులు పైగా రాకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలు చర్చించే వేదిక ఉన్న సమావేశం రాకపోతే ఎలా వారికి నోటీసులు ఇవ్వండి అంటూ ఎంపీడీవోని ఆదేశించారు. ఎంపీపీ సురేష్ బాబు, మండల ఉపాధ్యక్షులు రవీంద్ర, హరినారాయణరెడ్డి, తహశీల్దార్ వై.చిట్టిబాబు, ఎంపీడీవో శివరాజ్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై విస్తృత ప్రచారం

వ్యక్తిగత ఫిర్యాదులు చేయవచ్చు: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్నకు చెబుదాం (1902) కార్యక్రమం గురించి ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నుండి డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డిలతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని గురించి ప్రజలకు పూర్తిఅవగాహన కలిగించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వాలంటీర్లపై ఉందన్నారు. అందరూ ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయ పరిధిలోని ఉన్న గ్రామ, వార్డు వాలంటీర్లు అందర్నీ సచివాలయానికి పిలిపించుకొని జగనన్నకు చెప్పుదాం కార్యక్రమాన్ని గురించి వాలంటీర్లకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమానికి సంబంధించి తెలుగులో ఉన్న ఒక కాపీని ప్రింట్ తీసి ప్రతి వాలంటరీకు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్ర, శనివారం రెండు రోజుల వాలంటీర్లు వారికి కేటాయించిన ఇంటింటికీ వెళ్లి కుటుంబంలో ఉన్న పెద్దలకు ఈజగనన్నకు చెబుదాం కార్యక్రమం గురించి వారికి వివరించాలన్నారు. అలాగే దీనికి సంబంధించి వీడియో కూడా వారికి చూపించి, ఆ వీడియోను వారి ఫోన్‌కు పంపించాలన్నారు. అంతేకాకుండా 1902 ఫోన్‌చేసి ప్రజలు వారి వ్యక్తిగత, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి కూడా అందలేదన్న సమస్యలను, గ్రామానికి సంబంధించిన సమస్యలను కూడా చెప్పే విధంగా అవగాహన కలిగించాలన్నారు. శుక్ర, శనివారం రెండు రోజుల్లో వాలంటీర్లు ఎన్ని ఇండ్లకు వెళ్లారన్న పూర్తి రిపోర్టును కలెక్టర్‌కి అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలి : కమిషనర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' (1902) కార్యక్రమంపై విస్తత ప్రచారం చేయాలని, ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై గురువారం నగరపాలక కార్యాలయంలో వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వార్డు కార్యదర్శులు సమన్వయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, మేనేజర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, సిఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీగా ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

పోలీస్ ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీగా ప్రసాద్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డిని కలిశారు. 1991లో ఎస్ఐగా పోలీస్‌శాఖలో చేరి కర్నూల్ జిల్లాలో పలుచోట్ల పనిచేసి 2006లో సిఐగా, 2012లో డిఎస్పీగా పదోన్నతి పొంది డిఎస్పీగా గుడివాడ, ఆదోని, విజయవాడ ట్రాఫిక్, ఇంటలిజెన్స్ లాంటి పలుశాఖలలో ఉద్యోగం నిర్వర్తించారు. ఇటీవల డీఎస్పీలకు వచ్చిన ప్రమోషన్‌లో భాగంగా నెల్లూరులో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తూ ప్రమోషన్‌పై చిత్తూరుకు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్‌గా బదీలపై వచ్చారు. ఎస్పీ ఆపరేషన్స్‌గా పోస్టింగ్ ఇస్తూ అదనపు బాధ్యతలుగా ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్‌కు అటాచ్మెంట్ చేశారు.



అడిషనల్ ఎస్పీగా నియమితులైన ప్రసాద్

అటవీ భూములుంటే ఎఫ్ఆర్ఒకు తెలపండి : కలెక్టర్


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామాల్లో రీసర్వే చేసేటప్పుడు అటవీ భూములకు సంబంధించిన వివరాలు ఎఫ్ఆర్ఓలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశం మందిరంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డిలతో కలిసి సమావేశమయ్యారు. ఈసందర్భంగా రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించి జాయింట్ సర్వే, ఫాస్ట్ సెటిల్మెంట్, ఇంక్రోచ్మెంట్, ఏకో టూరిజం అభివృద్ధి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలకు సంబంధించి అటవీశాఖ అధికారులు, ఫాస్ట్ సెటిల్మెంట్ అధికారి, ఆర్డీఓలు, పలమనేరు, కుప్పం, పంచాయతీరాజ్, విద్యుత్, టూరిజం, అధికారులు, బంగారుపాళ్యం, పెద్దపంజాణి, గుడిపల్లి, సోమల మండలాల తహశీల్దార్లులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బంగారుపాళ్యం, సోమల, గుడిపల్లి, పెద్దపంజాణి, మండలాలలో రెవెన్యూ అటవీ భూములకు సంబంధించి రీసర్వే చేసేటప్పుడు ఎఫ్ఆర్ఓలకు తెలియజేసి జాయింట్ సర్వే చేయాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. అలాగే బంగారుపాళ్యం, సోమల, పెద్దపంజాణి మండలాలలో అటవీశాఖ అధికారులతో కలిసి జాయింట్ సర్వే చేసి రిపోర్టును జూన్ 10వ తేదీ నాటికల్లా కలెక్టర్‌కు అందజేయాలని ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిని ఆదేశించారు. పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా జరిగే పనులకు సంబంధించి ముందుగానే అటవీ శాఖ అధికారుల నుంచి పర్మిషన్లు తీసుకొని పనులు ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు. అటవీ ప్రాంతంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల కోసం ఎంతమంది గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారన్న వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని గిరిజన సంక్షేమశాఖ అధికారిని ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించి సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు 123 ఏనుగులు పలమనేరు, కుప్పం అటవీ ప్రాంతంలో ఉన్నాయని, ఏనుగులు వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతున్నదని తెలిపారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ వల్ల ఏనుగులు చనిపోతున్నాయని, అటవీ ప్రాంతంలో విద్యుత్‌పోల్స్, ట్రాన్స్ఫార్మర్స్ ఉన్నాయని, ఏనుగులు వచ్చే ప్రాంతాలలో ముందుగానే గుర్తించి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతంలో ఉన్న విద్యుత్ పోల్స్, ట్రాన్స్ఫార్మర్స్‌ను విద్యుత్, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వేచేసి ఎత్తు పెంచేదానికి విద్యుత్‌శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏనుగులు వల్ల రైతుల పంటలు నష్టపోయిన వారికి అటవీశాఖ ద్వారా హెక్టారుకు పదివేలు, ఎకరాకు 6000 చొప్పున నష్టపరిహారం అందజేస్తున్నామని, ఏనుగులు వల్ల చనిపోయిన వారికి నష్టపరిహారం పెంచడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఏకో టూరిజం అభివద్ధి కోసం అటవీ భూములను టూరిజం శాఖకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఏ.మూర్తి, విద్యుత్‌శాఖ డీఈ హరి తదితరులు పాల్గొన్నారు.



అటవీ భూముల సర్వేపై అధికార్లతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ఆర్‌బికెల్లో 'వేరుశనగ' సిద్ధం

డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: ఖరీఫ్‌లో వేరుశనగ పంటలు వేసుకోవడానికి అనుకూలమని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ఎస్ఎల్వి కళ్యాణ మండపంలో గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సబ్సిడీ వేరుశనగ విత్తనాలను మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ 2023లో పంటలు వేయడానికి అవసరమైన చర్యలు చేపడుతుందని, దీనికితోడు వర్షాలు కూడా తోడు కావడంతో వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. సాధారణంగా మన జిల్లాలో జూలై నెలలో వేరుశనగ, వరి పంటలు వేసుకోవడం జరుగుతుందని కానీ ఈఏడాది మే నెలలోనే వర్షాలు కురవడంతో వర్షాధారంగా సాగైన వేరుశనగ పంటని జూన్ నెలలోనే వేసుకోవడానికి రైతులు సిద్ధపడుతున్నారని అన్నారు. నవంబర్‌లో వచ్చే తుపానుల వలన కురిసే భారీ వర్షాలు నుంచి పంటలను కాపాడుకునేందుకు అవకాశం ఉంది ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్ హరితకుప్పయ్య, ప్రసాద్‌రెడ్డి, ఎంపిడిఓ కష్ణయ్య, ఎమ్మార్వో లోకనాథ్‌పిలై, దామోదర నాయుడు, కటికపల్లి మని, జనార్ధన్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

మండలానికి 2025 క్వింటాళ్ల వేరుశనగ : జడ్‌పి చైర్మన్

వి.కోట: మండల కేంద్రమైన వీకోటలోని వ్యవసాయ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలు పంపిణీ కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అవసరం కోసం మండలానికి 2025 క్వింటాళ్లు వేరుశనగ విత్తనకాయలు అందుబాటులో ఉంచామన్నారు. ఇంతవరకు 1765 క్వింటాళ్ల విత్తనాన్ని 18 రైతు భరోసా కేంద్రాలలో పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వేరుశనగ విత్తనకాయలు ఒక బస్తా పూర్తి ధర రూ.2790లు కాగా రాయితీ పై రూ.1674లకు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ యువరాజ్, వీకోట సర్పంచ్ పిఎన్.లక్ష్మి, వైస్‌సర్పంచ్ అక్మల్, బాలగురునాథ్, శ్రీరాములు రెడ్డి, గోపిరెడ్డి, పిన్‌నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం..

జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే...

ప్రజాశక్తి- వి.కోట: రాష్ట్రంలో ప్రజలకు అభివద్ధి సంక్షేమం అందించడంలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. వీకోట గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివద్ధి పనులను గురువారం జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలో గతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పట్టణంలోని జామియా మసీద్, ఈశ్వర్ నగర్ రోడ్డు, కన్యకా పరమేశ్వరి వీధి, బ్రాహ్మణ వీధుల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన సిమెంట్ రోడ్లను, మురుగునీటి కాలువలను ప్రారంభించారు. అదేవిధంగా కె.కొత్తూరు, దుర్గానగర్, గాండ్లపల్లి, సత్యసాయినగర్‌లో వేసిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ లైటును ప్రారంభించారు. వారి వెంట సర్పంచ్ పిఎన్.లక్ష్మి, ఎంపిపి యువరాజ్, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిఎన్. నాగరాజు, వైస్‌ఎంపిపి లక్ష్మణ్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలగురునాథ్, జిల్లా పరిషత్ సలహా మండలి సభ్యులు గైస్ తదితరులు ఉన్నారు.



రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-పలమనేరు: రాజకీయాలకు అతీతంగా సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని పలమనేరు శాసన సభ్యులు వెంకటే గౌడ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో కౌన్సిలర్ పూర్ణిమ ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సాంకేతిక కారణాలతో ఏదైనా సంక్షేమ పథకాలు రాని వారిని గుర్తించి తక్షణమే అధికారుల సమక్షంలో పరిష్కరించారు. వార్డు అభివద్ధికి నిరంతరం పాటు పడతానని అన్నారు. అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కుతుందని తెలిపారు. రాజకీయాలు, పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ పవిత్ర మురళీకష్ణ, వైస్ ఛైర్మన్ చాన్మ కమల్ బాషా, జెసిఎస్ కోదండ రామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి: టిడిపి



ప్రజాశక్తి-రామకుప్పం: రాజమండ్రిలో జరిగే టిడిపి మహానాడుకు రామకుప్పం మండలం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని రామకుప్పం మండల టిడిపి నేతలు కోరారు. గురువారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈసారి జరిగే మహానాడులో అన్ని వర్గాల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివద్ధికి టిడిపి చేపట్టనున్న కార్యక్రమాలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేసే ప్రకటన రాష్ట్ర భవిష్యత్తును మలుపు తిప్పేలా ఉంటుందన్నారు. మహానాడుకు నేతలు కార్యకర్తలు తరలి వచ్చి, పార్టీ ప్రకటించే విధానాలను ఆకళింపు చేసుకుని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు కోరారు. సమావేశంలో నేతలు మునస్వామి, అనంద రెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, రామమూర్తి పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియో రూ.50 లక్షలు ప్రకటించాలి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: పాముకాటుతో మరణించిన పోలీసు కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధికారి చినబాబు డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో ఆర్-5 జోన్ వద్ద బందోబస్తు నిమిత్తం ప్రకాశం జిల్లా దర్శి పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన పవన్ కుమార్ పిసి-2394ని వెంకటేశ్వర స్వామి గుడి కొండకింది భాగంలో రాత్రి పడుకుని నిద్రిస్తుండగా గత మంగళవారం తెల్లవారు జామున పాము కాటు వేయడంతో గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ రమేష్ కార్డియాక్ ఆస్పత్రికిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇలాంటి చోట ముళ్ళ పొదలు ఉండే రోడ్డు పై ఉద్యోగం, ఎండకు, వానకు సరైన సౌకర్యాలు లేని చోట రోడ్లపైనే నిద్ర, అదే ప్రాంతంలో పాము కాటుకు గురైన పోలీసు మరణించడం చాలా బాధాకరం అన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ప్రజాశక్తి-శాంతిపురం: రాళ్ళబుదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు 24 గంటలు అందించాలని గ్రామ సర్పంచ్ లక్ష్మీ మురుగేష్, వైసీపీ నాయకులు, ఆరోగ్య కేంద్ర వైద్యాధికారికి సూచించారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం సర్పంచ్, వైసీపీ నాయకులు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పై అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి మురుగేష్, మండల కో ఆప్షన్ నిసార్, వైసిపి నాయకులు రమేష్, పంచాయతీ కార్యదర్శి వనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను విస్తృతం చేయాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: 'జగనన్నకు చెబుదాం'ను విస్తత ప్రచారం చేయాలని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం మండల కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం'ను గ్రామాల్లో తెలియజేయాలని, సమస్యలు ఉన్నవారు 1902 కి ఫోన్ చేసి సమస్యను విన్నవించాలని, సమస్యలు లేని గ్రామాలుగా సష్టించాలని ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. సమస్యలు లేనిచో టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ప్రభుత్వ పరిపాలన విధానం బాగుందని తెలియజేసే విధంగా గ్రామస్తులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ పిఒపిఆర్‌డి దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు శంకరయ్య, చంగ్రాయలు, కుమార్, మధు, నూర్ అహ్మద్, హరిత, అవంతి, సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వాడకం

- అధికారుల నిబంధనలను పట్టించుకోని దుకాణదారులు





ప్రజాశక్తి-నగరి: పర్యావరణానికి ముప్పు అని తెలిసినా పాలిథిన్ కవర్ల వాడటంలో మార్పు రావడం లేదు. దీనిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు బహిరంగంగా కవర్లు వాడుతున్నా పట్టించుకోవడం లేదు. కొన్నిసార్లు సమావేశాల్లో అవగాహన ఏర్పరచినా దుకాణదారులు ఆ విషయాన్ని పెడచెవిన పెడుతున్నారు. గతంలో దుకాణాల్లో పేపర్లలో వస్తువులు కట్టి ఇచ్చేవారు. ఇప్పుడు అంతా కవర్ల వాడకానికి వచ్చేశారు. టిఫిన్ సెంటర్లు, కూరగాయల మార్కెట్, తోపుడు బండ్లు అంటూ ప్రతి చోటా పాలిథిన్ కవర్లే దర్శనమిస్తున్నాయి. 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న కవర్లు వాడరాదన్న నిబంధల్ని కూడా వారు తుంగలో తొక్కారు. ప్లాస్టిక్ కవర్లు భూమిలో పూర్తిగా విలీనం కావడానికి 400 సంవత్సరాలు పడుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విలీనం కాని ప్లాస్టిక్ కవర్లు భూమి పొరల్లో ఉంటూ వర్షపు నీటిని లోపలకు ఇంకకుండా అడ్డుపడుతున్నాయి. దీంతో నీరు భూమిలోకి వెళ్లక ఆవిరైపోతోంది. భూమట్టంలో నీటిశాతం తగ్గడానికి కూడా పాలిథిన్ కవర్లు కారణమౌతున్నాయి. కవర్ల రీసైక్లింగ్లో వెలువడే క్లోరినేటెడ్ హైడ్రోకార్బన్ నాడీ మండలాన్ని దెబ్బతీస్తుందని, చిన్న పిల్లలో జ్ఞాపకశక్తి తగ్గిస్తుందని, అలాగే కవర్లలో వేడి వస్తువులు వేయడం వలన కవర్లకు రంగులు వేయడానికి వాడే పిగ్మెంట్లు అందులో కలుస్తుందని ఈ కారణంగా గుండె జబ్బు, అంగ వైకల్యం, మానసిక వ్యా ధులు, కేన్సర్ లాంటి వ్యాధులు వచ్చే ఆస్కారం ఉందని వైద్యనిపుణులు తెల్పారు. ఈ కవర్లను కాల్చడం ద్వారా విడుదలయ్యే వాయువులు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులను కలిగిస్తుందని విశ్లేషకులు అంటున్నారు. గతంలో టీ షాపు ల్లోను పాలిథిన్ గ్లాసులనే వాడేవారు. పలు అవగాహన సదస్సుల నిర్వహణ ద్వారా వారిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం పాలిథిన్ గ్లాసులను వదిలిపెట్టి పేపర్‌తో తయారుచేసిన గ్లాసులను వాడుతున్నారు. ఈ మార్పు అన్ని దుకాణాల్లోనూ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మూగజీవాలకు హాని కలిగిస్తున్నాయి

ప్లాస్టిక్ కవర్లు పర్యావరణ నష్టంతో పాటు మూగజీవాలకు కూడా విఘాతం కలిగిస్తోంది. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తుండటంతో రోడ్డుపై తిరిగే పశువులు వాటిని ఆహారంగా తీసుకుంటున్నాయి. దీంతో పశువుల కడుపులోకి వెళ్లే ప్లాస్టిక్ వ్యర్థాలు అక్కడ జీర్ణం కాక పశువులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

వాడిపడేసే కవర్లు గాలికి ఎగురుతూ కాలువల్లో పడుతున్నాయి. అలా కాలువల్లో చేరిన ప్లాస్టిక్ కవర్లు మురుగు నీరు ముందుకు పోకుండా అడ్డుపడుతున్నాయి. దీంతో మురుగునీరు కాలువల్లో పేరుకుపోయి. మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం అవుతోంది.

ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి

వస్తువుల అమ్మకంలో దుకాణదారులు, కొనుగోలులో వినియోగదారులు కవర్ల వాడకం అనే సులభమైన పద్ధతికి అలవాటు పడిపోయారు. కవర్లు నిషేధించే సమయాల్లో దుకాణదారులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంభించడం లేదు. గుడ్డ సంచులు, పేపర్ సంచులను వినియోగంలోకి తేవడం లేదు. ఎలాగైనా పట్టుకెళ్లండని కొనుగోలు దారులకు చెప్పేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పాలిథిన్ కవర్ల నిషేధం కొన్నాళ్లకు కొండెక్కుతోంది.

రాజకీయాలు వీడి అభివృద్ధికి పాటు పడండి




ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రాజకీయాలు చేయడం వీడి అభివృద్ధికి ప్రతిపక్ష పార్టీలు పాటు పడాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ సచివాలయం పరిధిలో తాటిమాకుల కండ్రిగ, పిళ్ళారి కుప్పం, తూగుండ్రం, దళిత వాడ, ఆదిఆంధ్రవాడ, పకీర్ తోట గ్రామాలలో గురువారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి కుల, మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి 1902 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కండిగ దళిత వాడకు చెందిన మండల పరిషత్ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ యుగంధర్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, అతని భార్య దీపకు నర్సింగ్ ఉద్యోగం ఇప్పించడానికి కషి చేస్తానని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ అనిత, తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, లోకనాథంయాదవ్, రాజేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ, టీచర్‌ను తొలగించాలి



ప్రజాశక్తి-పలమనేరు: తాత్కాలికంగా సస్పెండ్ అయిన పెద్దపంజాణి మండలం ఎంఈఓ హేమలత, ఆమెకు బినామిగా వ్యవహరించిన టీచర్ హరి ప్రసాదులను పూర్తిగా విధుల నుంచి తొలగించాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డివి మునిరత్నం, వేలాయుధం డిమాండ్ చేశారు. అందులో భాగంగా నియోజకవర్గ సహాయ కార్యదర్శి మనీ అధ్యక్షతన గురువారం ఎంఈఓ అవినీతి అక్రమాలపై మానవ హక్కుల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు పనుల కోసం రూ.కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తే నాసిరకం పనులు చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం దుర్మార్గమన్నారు. తక్కువ ధరలకు మెటీరియల్ కొనుగోలు చేసి ఎక్కువ శాతం బిల్లులు వేసుకొని సొంత కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు వద్ద ముడుపులు తీసుకోవడం, ఉపాధ్యాయుల మెడికల్ లీవులు, సెలవులు విషయంలో అధిక మొత్తంలో ముడుపులు తీసుకున్నట్లు రుజువయ్యాయని ఉన్నతాధికారులు ఇచ్చిన ప్రాథమిక నివేదికలో వెల్లడయ్యాయన్నారు. వీరి అవినీతిని బయటపెట్టిన జర్నలిస్టులను బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఎంఈఓ, టీచర్ హరిప్రసాద్ అవినీతి వ్యవహారం బయటపడటంతో ఎలాగైనా అడ్డదారుల్లో వెళ్లి రికార్డులు తారుమారు, దొంగ ఓచర్ల సష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ప్రజల ద్వారా సమాచారం అందినట్లు తెలిపారు. ధనార్జనే ధ్యేయంగా ఉన్నందుకు ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులు 234 మంది ఫెయిల్ అవడంపై విచారించాలన్నారు. చాలా రోజుల నుండి మండలంలో ఇటువంటి అవినీతి అక్రమాలు విద్యాశాఖలో అనేకం జరుగుతున్నా ఉన్నత అధికారులు పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఎంఈఓ హేమలత, టీచర్ హరి ప్రసాద్‌పై నిష్పక్షపాతంగా వ్యవహరించి దుర్వినియోగమైన ప్రజాధనాన్ని రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్ సరస్వతి, శ్రీదేవి, మునిరత్నం, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పరిసర ప్రాంతాలలో కుక్కల కాటు వల్ల గాయపడుతున్న వారు నిత్యం పెద్ద సంఖ్యలో ఉన్నటువంటి విషయం స్థానిక ప్రజలు ఎమ్మెల్యే వెంకటేష్ గౌడ దృష్టికి గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సేకరించిన గణాంకాల మేరకు ఈ సంవత్సరం జనవరి నుంచి మే వరకూ, ప్రతినెలా 350 నుంచి 400 వరకు ఒక్క పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కుక్కకాటు వల్ల గాయపడి ప్రజలు చికిత్స తీసుకున్నారు అంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో గమనించాలన్నారు. గతంలో పెంపుడు కుక్కలకు లైసెన్సులు మంజూరు చేయడమే కాకుండా వీధి కుక్కల నియంత్రణకు పలమనేరు మున్సిపాలిటీ క్రమం తప్పక చర్యలు తీసుకునేది. యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూబీఐ) కుక్కల నియంత్రణ పట్ల స్పష్టమైన మార్గ దర్శకాలు విడుదల చేసినప్పటికీ, ఆ మేరకు ఇటీవల కాలంలో అటువంటి నియంత్రణ కార్యక్రమాలు ఏవి కూడా పలమనేరు మున్సిపాలిటీ చేయకపోవడం వల్ల, కుక్కల సంఖ్య ఎక్కువై, ప్రజలకు పాదచార్లకు వాహనదారులకు భద్రత లేకుండా పోతున్నది. రోడ్ల పై పెద్ద పెద్ద గుంపులుగా వీటి సంచారం వలన పిల్లలు కూడా భయ భ్రాంతులకు గురవుతున్నారు. కాబట్టి వెంటనే పెంపుడు కుక్కల లైసెన్స్ జారీ చేయడమే కాకుండా వీధి కుక్కల జనాభా నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకొని ప్రజలను కుక్క కాట్ల బారి నుండి కాపాడడానికి పలమనేరు మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పలమనేరు మున్సిపాలిటీ పరిధి గుడియాత్తం రోడ్డు నందు మురుగునీటి కాలువ శుభ్రం చేయకుండా వదిలి వేయడం వల్ల అక్కడ మురుగు చేరి విపరీతంగా దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి వెంటనే అక్కడ డ్రైనేజీ మరమ్మత్తులు కూడా చేపించి పరిశుభ్రం చేయాల్సినటువంటి అవసరాన్ని మీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.

భూ దందాలను అరికట్టండి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని తార్లబైలు గ్రామ సరిహద్దుల్లో అన్యాక్రాంతమవుతున్న భూ ఆక్రమణలను అరికట్టాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు పురుషోత్తం విలేకరులకు తెలిపారు. గురువారం తాళ్లబైలులోని ప్రభుత్వ భూమిని జనసేన నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వ భూమి నిరుపేదలకు లేకుండా చేస్తున్నారని తెలిపారు. స్థానిక తహశీల్దార్ వెంటనే స్పందించి, తార్ల బైలులో ప్రభుత్వ భూమికి సూచిక బోర్డు ఏర్పాటు చేసి రక్షించాలని కోరారు. మండలంలో భూ దందాలను అరికట్టి రెవెన్యూ చట్ట ప్రకారం శిక్ష విధించాలని జనసేన పార్టీ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కోలార్ వెంకటేష్, నియోజకవర్గ భూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, యువజన అధ్యక్షులు సతీష్, అజయ్, శరత్ పాల్గొన్నారు.

నియామకం



ప్రజాశక్తి-కార్వేటినగరం: జీడీ నెల్లూరు నియోజకవర్గానికి బలిజ కాపు సంక్షేమ సేవ అధ్యక్షుడిగా కె.ప్రసాద్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ కాపు బలిజ సంక్షేమ సేవ అధ్యక్షులు మాజీమంత్రి హరి రామ జోగయ్య ఆదేశాలతో నియమించినట్లు, రాష్ట్ర సంక్షేమ శాఖ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.గోపి రాయల్ చేతుల మీదుగా నియమక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బలిజ కాపు సంక్షేమ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తామన్నారు. అదే విధంగా జిడి నెల్లూరు నియోజకవర్గ బలిజ సోదరుల అభివద్ధికి తన వంతు కషి చేస్తానని పేర్కొన్నారు. బలిజ సోదరులందరి సహాయ సహాకారాలు అందించాలని కోరారు.

వర్షంతో ఉపశమనం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఉక్కపోత తగ్గుముఖం పట్టి చల్లని గాలులు వీయడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అదేవిధంగా మురికి కాలవల్లో వ్యర్థాలు ఎక్కువగా ఉండటంతో వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తుందని, ఇకనైనా సంబంధిత అధికారులు మురికి కాలువల్లోని వ్యర్థాలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి




ప్రజాశక్తి-వెదురుకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం కుమార్తె, రాష్ట్ర నాయకురాలు కృపా లక్ష్మి కోరారు. గురువారం వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఏవో వనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం కుమార్తె, రాష్ట్ర నాయకురాలు కృపా లక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పిటిసి సుకుమార్, మాజీ జడ్పిటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ కామసాని పద్మనాభరెడ్డి, మాజీ మండల కన్వీనర్ పేట ధనంజయ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాధిక పురంధర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి, మండల అధ్యక్షులు సురేష్ బాబు, ఉపాధ్యక్షులు హరి నారాయణ రెడ్డి, రవీంద్ర మండల అభివద్ధి అధికారి శివరాజ్, అగ్రికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యాదమరి: ప్రతి రైతుకు వేరుశనగ విత్తనాలు అందాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు, జడ్పీ వైస్ ఛైర్మన్ బి ధనంజయ రెడ్డి గురువారం మండల పరిషత్ కార్యాలయావరణంలో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క రైతుకు పారదర్శకంగా సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందించాలన్నారు. వ్యవసాయ అధికారి చరిత మాట్లాడుతూ రైతుల కోసం మండలానికి 1200 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు అవసరం ప్రస్తుతానికి 700 క్వింటాళ్లు మండలానికి వచ్చాయన్నారు. ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో పంపిణీకి సిద్ధంగా ఉంచడమైనదన్నారు.

శాంతిపురం: మండలంలో ఖరీఫ్ 2023 గాను వేరుశనగ విత్తన పంపిణీ సబ్సిడిపై రైతు భరోసా కేంద్రాలలో బయోమెట్రిక్ విధానంలో రైతులకు ఆధార్, పట్టాదారు పాస్ బుక్, మొబైల్ ఆధారంగా మండలంలో రెండు విడతలుగా ఇవ్వడం జరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి అప్పోజి తెలిపారు. మండలంలో 3200 హెక్టార్లలో వేరుశనగ సాగు జరుగుతుంది దీనికి అనుగుణంగా మండలానికి 1860 క్వింటాళ్లు ప్రతిపాదించారని ప్రస్తుతానికి 744.90 క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాలలో చేరాయని తదుపరి సోమవారం లోపు అన్ని రైతు భరోసా కేంద్రాలలో విత్తన నిలువలు ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. మొదటి విడతగా 29వ తేది నుంచి సొన్నేగానిపల్లి, దండి కుప్పం, కొలమడుగు, మఠం, ఎంకె పురం, రాళ్ళబుదుగూరు, శివరామాపురంలో రైతు భరోసా కేంద్రాలలో అందిస్తామని, రెండో విడతగా మే 31 తేదీ నుంచి కేనుమాకులపల్లి, కడపల్లి, కర్లగట్ట మొరసనపల్లి,121 పెద్దూరు,అనికేర, చెంగుబళ్ళ, 64 పెద్దూరు, సి బండపల్లి, అబకలదొడ్డి, గుంజార్లపల్లి మరియు చిన్నారిదొడ్డి రైతు భరోసా కేంద్రాలలో రైతులకు విత్తన పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

కార్వేటినగరం: మండలంలోని రైతులు వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం కార్వేటినగరం గుంట పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ లతబాలాజీ మాట్లాడుతూ నారాయణ అనే రకము 30 కేజీల బస్తా ఖరీదు రూ.2955 రూపాయలు అందులో రైతుకు సబ్సిడీ కింద రూ.1773 లు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి రైతుకు రెండు బస్తాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పాస్ పుస్తకం, అకౌంట్ జిరాక్స్ తీసుకొని రావాలని ఏవో హేమలత తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శేఖర్ రాజు, ఎంపీడీవో మోహన్ మురళి, సర్పంచ్ ధనంజయ వర్మ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కష్ణ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నివాళి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లె పంచాయతీ కమ్మకండ్రిగకు చెందిన బోరు మునిశంకరయ్య రాయల్ గురువారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకులు వెళ్లి మతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెదురుకుప్పం మండల టిడిపి మాజీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పి.మోహన్ మురళి, నియోజకవర్గ టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు గాంగయ్య రాయల్, లోకేష్ రెడ్డి తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

వైసీపీ చేసిందేమీ లేదు...!



ప్రజాశక్తి-రామకుప్పం: వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా ఆ పార్టీ నేతల భూ కబ్జాలు, అరాచకాలు, దౌర్జన్యాలు తప్ప పేదలకు ఒరిగిందేమీ లేదని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ప్రధాన కార్యదర్శ నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డిలు అన్నారు. గురువారం రామకుప్పంలో ఇదేం ఖర్మ రచ్చబండ సభలో వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీ ఎక్కడ చూసినా ప్రహసనంగా మారిందన్నారు. అర్హులైన పేదలకు స్థలాలు ఇవ్వటం లేదన్నారు. ప్రతి చోటా వైసీపీ నేతలు పేదలకు ఇళ్ల స్థలాల పేరిట ప్రభుత్వ సొమ్ముతో భూములు సేకరించి, వాటిలో అధిక భాగం ఆక్రమించి విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. లబ్ధిదారుల నుంచి ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూళ్లు చేశారన్నారు. టీడీపీ పాలనలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు జవాబుదారీతనంతో పని చేశామన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రతి పథకాన్ని పార దర్శకంగా అందాయన్నారు. అవినీతి, అక్రమాలు, అరాచకాలు లేని పాలన కావాలంటే ప్రజలు రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. అదేవిధంగా కుప్పం నుంచి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీతో ఘన విజయం అందించాలన్నారు.

వేసవి శిక్షణ ముగింపు సమావేశం



ప్రజాశక్తి-పలమనేరు: గత 25 రోజులుగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళామందిరంలో నైతిక విలువలపై జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరం ముగింపు సమావేశం శనివారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభం అవుతుందని సంస్థ అధ్యక్షులు పి.తులసి నాదం నాయుడు గురువారం తెలిపారు. విద్యార్థులు అందరికీ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందిస్తామన్నారు. అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

ఆగిపోయిన గ్రూపులను తిరిగి నడిపించాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలో ఆగిపోయిన గ్రూపులను తిరిగి నడిపించాలని ఐకెపి ఎపిఎం పరిధి మస్తాన్ తెలిపారు. గురువారం ఐకెపి కార్యాలయంలో అన్న సోషల్ మొబిలిజేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా మండల సమైక్య పరిధిలో సమావేశం నిర్వహించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఐకెపి ఎపిఎం మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో ఇంకా మిగిలిపోయిన పేద, నిరుపేదలను గ్రూపులోకి తీసుకురావాలన్నారు. ఆగిపోయిన గ్రూపులను తిరిగి నడిపించాలని ప్రతి సంఘ సభ్యురాలు ఆర్థిక నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. డిజిటల్ లావాదేవీలపై తరవుగా వివరించారు. అనంతరం మండల కేంద్రం నుంచి పాలసందల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసి చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురుగయ్య, మంజుల, శోభ, అరుణ, గీత, యశోద, జయలక్ష్మి, బాలయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన



ప్రజాశక్తి-యాదమరి: అవ్వ, తాత కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు యాదమరి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో అవ్వ, తాత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పంచాయతీ సర్పంచ్ మీనా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆప్తాలమిక అసిస్టెంట్ మంజులవాణి 18o కొత్తపల్లి గ్రామ సచివాలయంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వీరిలో కొందరికి కళ్లద్దాలు, మరికొందరికి ఆపరేషన్ల నిమిత్తం రెకమెండ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి విష్ణు ప్రియ, మహిళా ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్త శ్రీమతి పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు కాలుష్య నిర్మూలన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పర్యావరణ రక్షణకు కాలుష్యాన్ని నిర్మూలించాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కిరణ్ కుమార్, కుసుమ కుమారి అన్నారు. గురువారం స్థానికమండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వారు వెలుగు సిబ్బందితో కాలుష్యాన్ని నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మాట్లాడుతూ పర్యావరణ ప్రాముఖ్యతను మా స్నేహితులకు, మా కుటుంబీకులకు, ఇతరులకు నిరంతరం గుర్తు చేస్తామన్నారు.